క్లుప్తంగా

అమ్మ ఆదర్శ పాఠశాలలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులపై మంగళవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ సూచించారు. అనంతరం మండలంలోని పాఠశాలల్లో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ భగవాన్, ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం



వెంకటయ్యను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంగాంధీచౌక్: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ బిక్కి వెంకటయ్యను సహచర ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు శాలువాతో సత్కరించారు. మంగళవారం ఖమ్మం విచ్చేసిన వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిసి తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎల్‌పీజీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా మేళ్లచెరువు వెంకటేశ్వరరావు తన అనుభవాలను కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌లకు వివరించారు.

సుబ్లేడు ఆస్పత్రిని పరిశీలించిన డీఐఓ

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రునాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించాక వైద్య సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీకాలు, జాతీయ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్లలో మొక్కలు నాటించిన ఉద్యానాధికారి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని జూబ్లీక్లబ్ నుంచి కాల్వొడ్డు వరకు ఉన్న డివైడర్లలో మొక్కలు లేని చోట కొత్త మొక్కలను కేఎంసీ ఉద్యానాధికారి బెల్లం రాధిక నాటించారు. మంగళవారం కేఎంసీ కార్మికులతో మొక్కలు నాటించి నీళ్లు పోయించారు. నగరంలో మొక్కలు లేని చోట కొత్తగా నాటాలని, డివైడర్లలో ఎక్కువగా పూల మొక్కలు నాటేలా చూడాలన్నారు.

ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగాపురంతండాకు చెందిన బాలకృష్ణ (40) మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థి మిట్టపల్లి కరుణాకర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆయన ఈనెల 16నుంచి మెదక్ జిల్లా చేగుంటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం రావెళ్ల కరుణ తెలిపారు. ఈసందర్భంగా కరుణాకర్‌కు మంగళవారం హెచ్ఎం ఆధ్వర్యాన సన్మానించి నగదు పారితోషికం అందజేశారు. పీడీ కె.రామారావు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బాలబోయిన ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దేవర
వినోద	లక్కీ భాస్కర్
సాయిరాం	అప్పుడో ఇప్పుడో ఎప్పుడో
ఆదిత్య	రాధేకృష్ణ
శ్రీనివాస	అమరన్
సినీ గెలాక్సీ	ధూంధాం, ఈసారైనా?!

- ఖమ్మంగాంధీచౌక్

అభివృద్ధిపై ఆశలు..



సీసీరోడ్డు లేని ఏదులాపురంలోని ఆటోనగర్ రోడ్డు



రాజీవ్‌గృహకల్పలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

జీపీల్లో వెంటాడుతున్న పారిశుద్ధ్య సమస్యలు

- దశాబ్దాలుగా కుంటుపడుతున్న అభివృద్ధి
- ఏదులాపురం కేంద్రంగా నూతన మున్సిపాలిటీకి ఏర్పాట్లు
- గతంలో కార్పొరేషన్‌లో విలీనమైనా తీరని సమస్యలు
- సౌకర్యాల మెరుగుపై గ్రామస్తుల గంపెడాశలు

ఖమ్మానికి కూతవేటు దూరంలో ఉన్నా.. ఆ గ్రామ పంచాయతీలు అభివృద్ధిలో అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ జీపీలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఏదులాపురం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయనున్నారు. అయితే ఇంతకాలం అభివృద్ధికి నోచుకోని ఖమ్మంరూరల్ మండలంలోని 12 జీపీలు ఇప్పుడు మున్సిపాలిటీలో భాగం కాబోతున్నాయని, ఇకనైనా తమ సమస్యలు తీరుతాయని గంపెడాశతో ఆయాగ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం, పెదతండా, వెంకటగిరి, గుర్రాలపాడు, గుదిమళ్ల, మద్దులపల్లి, తెల్దారుపల్లి, గొల్లగూడెం, బారుగూడెం, ముత్తగూడెం, పోలేపల్లి పంచాయతీలోని రాజీవ్‌గృహకల్ప, పల్లెగూడెం పంచాయతీలోని రెడ్డిపల్లి గ్రామాలను కలిపి ఏదులాపురం కేంద్రంగా నూతన మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ 12 జీపీల్లో గత దశాబ్దాల కాలంగా చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదు. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు, సైడ్ డ్రెయిన్ల ఏర్పాటు, సీసీరోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనుల విషయంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అరకొర నిధులు..

సర్పంచ్‌ల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభివృద్ధి పనులకు నిధులు వచ్చినా.. అవి ఏ మూలకు సరిపోకపోవడంతో పాటు వచ్చిన నిధులను కూడా సక్రమంగా వినియోగించలేకపోయారు. ఇప్పటికీ మేజర్ పంచాయతీలుగా ఉన్న పెదతండా, ఏదులాపురం, ముత్తగూడెం, పోలేపల్లి పరిధిలోని రాజీవ్‌గృహకల్పతో పాటు ఏదులాపురం పంచాయతీలోని సత్యనారాయణపురం, చినతండా, సాయిప్రభాత్‌నగర్‌లలో సైడ్ డ్రెయిన్లు, సీసీరోడ్లు లేమి కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. వీటితో పాటు మిగతా గ్రామపంచాయతీల్లో కూడా అక్కడక్కడా సైడ్‌కాల్వల నిర్మాణం లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు వీధుల్లో పారుతుండడం నిత్యకృత్యంగా మారింది. ఇక తాగునీరు విషయంలో శుద్ధమైన నీటిని ప్రజలకు అందించడంలో పంచాయతీల పాలకులు, అధికారులు విఫలమయ్యారు. తప్పని పరిస్థితుల్లో వాటినే వాడాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్ ఏదైనా మరమ్మతులకు గురైతే నెలల తరబడి వేచిచూడాల్సిన దుస్థితి ఇప్పటికీ నెలకొంది.

ఇకనైనా సమస్యలు తీరేనా?

ఇన్నాళ్లూ పంచాయతీల పాలనలో కొనసాగిన 12 పంచాయతీలు త్వరలో మున్సిపల్ పాలన కిందకు రాబోతున్నాయి. దీంతో నూతన మున్సిపల్ పాలనలోనైనా సమస్యలు తీరేనా లేక షరా మామూలేనా అనే సందిగ్ధంలో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక నుంచి 12 గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడతాయని, గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులు అన్నీ సమకూరుతాయని ప్రజలు కలలు కంటున్నారు.

విలీనమైనా..

ఖమ్మానికి దగ్గర ఉన్నా పెదతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్ల గ్రామపంచాయతీలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గతంలో ఖమ్మం కార్పొరేషన్‌లో విలీనం చేశారు. అనంతరం ఈ పంచాయతీలకు నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారులను నియమించి రెండేళ్లపాటు పాలన కొనసాగించింది. అయినా అభివృద్ధి అనేది కనుచూపు మేరలో కానరాకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉంది. ఆ తర్వాత ఆయా పంచాయతీల ప్రజల కోరిక మేరకు తిరిగి గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ ఐదు పంచాయతీలతో పాటు మిగతా ఏడు పంచాయతీలను కలిపి నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాగా, మున్సిపాలిటీలో కలపాలనుకున్న 12 పంచాయతీల్లో ఇప్పటికే అధికారులు గ్రామసభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఎక్కువ గ్రామపంచాయతీలు మున్సిపాలిటీ ఏర్పాటు వైపే మొగ్గు చూపడం గమనార్హం.



నూతన మున్సిపాలిటీగా ఏర్పాటు కానున్న ఏదులాపురం

కుటుంబ సర్వే ప్రారంభించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇళ్ల గుర్తింపు పూర్తయిన ప్రాంతాల్లో కుటుంబ సర్వే ప్రారంభించాలని డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం నగరంలోని డీపీఆర్సీ భవనంలో ఎన్యూమరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఒక్కో కుటుంబానికి 35 నిమిషాల నుంచి 45 నిమిషాలు కేటాయించి సర్వేకు సంబంధించిన వివరాలను సేకరించాలన్నారు. ప్రతీ రోజు ఉదయాన్నే ప్రజలు ఇళ్ల వద్ద ఉన్న సమయాన తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సంబంధిత ఫారాలను సూపర్‌వైజర్లకు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఓ జి.శ్రీనివాసరావు, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కుటుంబ సర్వే ప్రారంభం..

కేఎంసీలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే రెండో దశ మంగళవారం నుంచి ప్రారంభమైంది. నగరంలో 1,63,633 ఇళ్లకు స్టిక్కరింగ్ వేయగా.. 965 ఈబీలుగా కేటాయించారు. దీంతో 326 ఈబీల్లో సర్వే ప్రారంభించగా.. 1,758 కుటుంబాలను సర్వే చేసి సమాచారం సేకరించారు.

నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: మండలంలోని చెన్నారం, సుర్దేపల్లి, మోటాపురం గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీఓ ఎం.యర్రయ్య పరిశీలించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు రాలేదన్నారు. ఈ సర్వేలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

మరోసారి సర్వే చేయాలి



అధికారులను అడ్డుకుంటున్న రైతులు

రఘునాథపాలెం: మండలంలోని గుడరాయి చెరువు, చెరువు శిఖం భూముల సర్వే చేసిన మండల సర్వేయర్ ఇచ్చిన సర్వే రిపోర్ట్‌పై అనుమానాలను వ్యక్తం చేస్తూ చెరువు హద్దు రాళ్లు వేయబోతున్న ఇరిగేషన్ అధికారులను మంగళవారం రైతులు అడ్డుకున్నారు. ఇటీవల చెరువు భూమి, శిఖం భూమి ఆక్రమణకు గురైనట్లు రైతులు ఫిర్యాదు చేయగా.. సర్వే చేసి రిపోర్ట్ ఇచ్చారు. దీంతో ఇరిగేషన్ అధికారులు హద్దురాళ్లు పాతేందుకు వెళ్లడంతో సర్వే సక్రమంగా జరగలేదని, సర్వేపై అనుమానం వ్యక్తం చేస్తూ మరోసారి సర్వే చేయాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు భూక్యా జంలానాయక్, భూక్యా రమణనాయక్, భూక్యా శంకర్‌నాయక్, భూక్యా వెంకన్ననాయక్, బాదావత్ మంగునాయక్, భూక్యా లక్ష్మ, బానోత్ జంపా, రాము, బానోత్ నాగు, మలాత్ మంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాతోనే సమస్యలకు పరిష్కారం



కార్యదర్శిగా ఎన్నికైన ఉపేందర్

ఖమ్మంఅర్బన్: దేశ ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పు రావాలంటే అది ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కొత్తగూడెం సీతారాం ఏచూరినగర్‌లో నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తూ, బడా నేతలకు కొమ్ముకాస్తూ ఆర్థిక అసమానతను పెంచి పోషిస్తుందని విమర్శించారు. భవిష్యత్‌లో ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాకుండా ఉండేందుకు ఎర్రజెండా నాయకత్వాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం కార్యదర్శిగా బత్తిని ఉపేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని మరో 21 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. షేక్ మీరా సాహెబ్ ఎర్రబోయిన గోవిందరావు, బొడ్డు పద్మ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రమ్, కళ్యాణ వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు తుమ్మ విష్ణు, దొంగల తిరుపతిరావు, నవీన్‌రెడ్డిలతో పాటు ముదం శ్రీనివాసరావు, షేక్ బషీరుద్దీన్, ప్రవీణ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

24న 'కమ్మవారి కార్తీక వనభోజనాలు'




వివరాలు వెల్లడిస్తున్న వనభోజన నిర్వహణ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని వెలుగుమట్ల అటవీ పార్క్‌లో ఈనెల 24న 'కమ్మవారి కార్తీక వన భోజనాలు'ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు వేజళ్ల సురేష్, గుడవర్తి నాగేశ్వరరావు, రావూరి సైదుబాబు, మిక్కిలినేని నరేంద్ర తెలిపారు. ఈసందర్భంగా అటవీపార్క్‌లో మంగళవారం వారు మాట్లాడారు. కుటుంబమంతా ఒకరోజు ఆహ్లాదంగా గడిపేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, కమ్మ కులస్తులంతా కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో గుత్తా వెంకటేశ్వర్లు, జట్ల శ్రీను, చంద్ర రాంబాబు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, సరిపూడి సతీష్, గోజ్జడ సత్యనారాయణ, పొట్ల వీరేందర్, నెల్లూరి కోటేశ్వరరావు, సంక్రాంతి నాగేశ్వరరావు, మార్నేళ్ల లక్ష్మణరావు, శివ పాల్గొన్నారు.

...ఆత్మీయ సమ్మేళనం

● **ఖమ్మం మామిళ్లగూడెం:** ఈ నెల 24న ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పలువురు నేతలు తెలిపారు. మంగళవారం ఖమ్మం గొరిల్లా పార్కులో వెల్లంపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశం నిర్వహించగా పలువురు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ సుబ్బారావు, ధూళిపాళ నాగేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరావు, ఖయ్యూం, రవ, ఎల్వీ రావు, రాజేశ్వరావు, ప్రదీప్, అంకిత రవి, విప్లవకుమార్, కర్నాటి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఒయాసిస్ రిసార్ట్‌లో ఈ నెల 15న జరిగే మాల, మాల ఉపకులాల ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. మంగళవారం ఖమ్మం అంబేద్కర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారుడు లింగాల రవికుమార్, బాబూరావు, ముదుసు జాకోబ్‌ప్రతాప్, దయానంద్, దామళ్ల సత్యం, కనకరాజు, చిరంజీవి, మల్లయ్య, యోనా, తొగరు భాస్కర్, శ్రీనివాస్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ నిబంధనలు సడలించాలి

ఖమ్మంరూరల్: జిన్నింగ్ మిల్లుల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అఖిత భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గుర్రాలపాడు, పొన్నేకల్‌లో గల జిన్నింగ్ మిల్లులోని కొనుగోలు కేంద్రాలను బృందం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీఐ కేంద్రాల్లో నామమాత్రంగా పత్తి కొనుగోళ్లు జరగడంతో రైతులు తెచ్చిన పత్తిని తేమ శాతం పేరుతో కొనకుండా తిరస్కరిస్తున్నారని తెలిపారు. సీసీఐ నిబంధనలు కఠినతరంగా ఉన్నాయని, దీంతో రైతులు నష్టపోతున్నారని, కౌలు రైతుల పత్తిని కూడా కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా, అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కమ్మ కోమటి నాగేశ్వరరావు, కేలోతు లక్ష్మణ్, బందెల వెంకయ్య, ఎం.మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సీసీఐ అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఖమ్మంఅర్బన్: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధర రావాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 8వ డివిజన్ వెలుగుమట్లలో చందమామ సమైఖ్య గోపాలపురం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నలకు మద్దతు ధర ప్రకటిస్తూ 500 రూపాయల బోనస్‌ను ప్రకటించిందన్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లాకావత్ సైదులు, మెప్మా అధికారిణి పి.సుజాత, అర్బన్ వ్యవసాయ అధికారి కిషోర్ బాబు, ఏఈఓ దివ్య మనీషా, వెంకటేశ్వర్లు సెంటర్ ఇన్‌చార్జ్ డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్

పంట అవశేషాలను తగలబెట్టొద్దు

కూసుమంచి: వరి కోతలు పూర్తయిన రైతులు పంట అవశేషాలను తగలబెట్టొద్దని ఏఓ వాణి సూచించారు. మంగళవారం మండలంలోని మల్లాయిగూడెంలో రైతులు వరి అవశేషాలను తగులబెడుతుండగా.. ఏఓ వారితో మాట్లాడారు. అవశేషాలను తగలబెట్టడం వలన భూమిలో ఉపయోగకరమైన సూక్ష్మజీవులు చనిపోవడంతో పాటు భూమిలోని సేంద్రీయ కర్బనం దెబ్బతింటుందన్నారు. రైతులు అవశేషాలను భూమిలో కలియదున్నడం వలన కార్బన్, నత్రజని, భాస్వరం భూమిలో కలిసి పంటలకు ఉపయుక్తంగా మారుతుందన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వాణి

వైద్య విద్యార్థినికి చేయూత



చెక్కు అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: విద్యారంగంలో ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ పి.శ్రీజ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ట్రస్ట్ ద్వారా విద్యార్థినికి రూ.20 వేల చెక్కును అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. నగరానికి చెందిన గజెల్లి పూజిత నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందగా కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ట్రస్ట్ ఆధ్వర్యాన ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తండ్రి వెంకన్నతో పాటు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలూ ముఖ్యమే..



స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభిస్తున్న కమాండెంట్ ఆఫీసర్, డైరెక్టర్

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని ఎన్‌సీసీ కమాండెంట్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన 3వ స్పోర్ట్స్‌మీట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని, ప్రతీ విద్యార్థికి ఇవి చాలా అవసరమన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి మాట్లాడగా.. ప్రిన్సిపాల్ గుప్తా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' హవా

ఖమ్మంసహకారనగర్: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన యూసీమాస్ అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల నుంచి హాజరైన 46 మంది విద్యార్థులు హాజరై గ్రూప్ చాంపియన్‌గా నిలిచారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. విద్యార్థులు పి.శ్రీప్రణవ్, నూర్‌దీప్ నందన్‌రెడ్డి గ్రూప్ చాంపియన్ సాధించి రూ.1,500 నగదు బహుమతి అందుకున్నారని, కె.సాయిఅభిరామ్(7వ తరగతి) సైతం చాంపియన్‌గా నిలవగా మిగతా విద్యార్థులు సైతం బహుమతులు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కోచ్ మల్లికను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ మంగళవారం అభినందించారు.

విజయవంతమైన బాలల దినోత్సవ పోటీలు



నేలకొండపల్లి బాలికల హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

నేలకొండపల్లి: బాలల దినోత్సవం సందర్భంగా భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీలు విజయవంతమయ్యాయి. స్థానిక వాసవి భవన్‌లో మంగళవారం నిర్వహించిన పోటీలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం విజేతలకు మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయన్నారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ప్రతినిధులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంత పూడ్చాలి



రహదారిపై ఏర్పడిన గుంత

కామేపల్లి: ముచ్చర్ల -ఏన్కూర్ ప్రధాన రహదారిలో కెప్టెన్ బంజర స్టేజీ దగ్గర ఉన్న పెద్దమ్మతల్లి గుడి వద్ద బీటీ రోడ్డుపై సుమారుగా మూడు అడుగుల గుంత ఉంది. నిత్యం వందలాది వాహనాలు ఈరోడ్డుపై తిరుగుతున్నా.. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పాటు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా పెట్టలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని మంగళవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలె శ్రీనుయాదవ్ వాహనదారులతో కలిసి గుంత పూడ్చాలని ఆందోళన నిర్వహించారు.

విద్యార్థుల ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలపై సమగ్రమైన విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్‌లు వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అలా జరగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలన్నారు.

ఖాళీ స్థలాలతో కలవరం..



ఇళ్ల మధ్య ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు పాములకు నిలయాలుగా మారుతున్నాయి. నగరంలోని మామిళ్లగూడెంలో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి విష కీటకాలకు నిలయాలుగా మారాయి. అంతే కాక దోమలు కూడా వృద్ధి చెందడంతో రోగాలబారిన పడుతున్నామని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ఖమ్మం మామిళ్లగూడెం